మా తాతమ్మ చెప్పిన పాతకథ

# స్వర్గారోహణం

పునరుక్తీకరణ: వి. ఆర్. వేలూరి

అనగాఅనగా ఒక ఊరు. అతి పురాతనమైన ఊరు. సనాతనధర్మాన్ని మ్లేచ్ఛుల విషసర్ప పరిష్వంగంలో పడనీయకుండా, వేయిపడగలతో కాపాడుతూ, త్రిలింగదేశంలో ప్రసిద్ధికెక్కిన ఊరు, అది. వైదిక చాతుర్వర్ణ్యవ్యవస్థని విజయవంతంగా సమర్థిస్తున్న ఊరది. కృష్ణాగోదావరీ జీవనదుల జలం ధర్మంగా, సస్యశామలంబై, పెద్దపెద్ద బంగళాలవాళ్ళ బొక్కసాలు, బొర్రలూ నిండుగా మెండుగా నింపుతున్న ఊరది. మా వూరు కాదది.

ఆ ఊరికి ఉత్తరాన బృందావనం. బృందావనంలో ఒక బృహన్మఠం. బృందావనంలోని బృహన్మఠంలో అందాలు చిలికే ఓ బంగారు పర్ణశాల. బంగారు పర్ణశాలలో శ్రీ శ్రీ శ్రీ (1001) భ్రమరానంద స్వామివారు. స్వామివారు సర్వదా కాషాయాంబరధారి. స్వామి వారి చుట్టూ వారి శుశ్రూషచేసే అనంత శిష్యసమూహం. శ్రీ వారి శుశ్రూష చేస్తూన్న శిష్యసమూహంకూడ కాషాయాంబరధారులే!

శ్రీ శ్రీ శ్రీ భ్రమరానంద స్వామివారు వేదవేదాంగ పారంగతులు. సర్వ శాస్త్రరసజ్ఞులు. శ్రీమద్భగవద్గీతనీ, అనుగీతనీ అధ్యయనంచేసి, ఆరుభాషల్లో (సంస్కృతం తో కలిపి ఏడు!) వ్యాఖ్యానించిన మహాపండితులు. శ్రీ స్వామివారు పూర్వమీమాంస, ఉత్తర మీమాంసల్లో ఘనాపాటి. ఒక్కమాటలో, తెలుగులో చెప్పాలంటే, స్వామివారు బహుముఖ ప్రజ్ఞాత.

కేవలమూ కైవల్య సాధనకై వందలకొద్దీ బంగాళాయిళ్ళ బాబులు దేశదేశాలనుంచీ (అంటే చుట్టుపక్కల ఊళ్లనుంచి) బృందావనానికి వచ్చేవారు. విడిది చేసేవారు. శ్రీ స్వామి వారి పాదసన్నిధిని చేరి, దైవ సాన్నిధ్యం సాధించడానికి అవసరమైన సర్వశాస్త్రాలూ కూలంకషంగా చదివి, కంఠస్థంచేసి, వారివారి దేశలలో వారివారి నెలవులకు తిరిగి వెళ్ళడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. శ్రీ శ్రీ శ్రీ (1001) భ్రమరానంద స్వామివారు, ఊరికి ఉత్తరానవున్న, బృందావనంలోని బంగారు పర్ణశాల నుంచి, సర్వసాధారణంగా బయటి ప్రపంచం చూడరు. పామరజనులకి పనికొచ్చే విషయాలు పట్టించుకోరు.

ఇలావుండగా, ఒకసారి శ్రీ శ్రీ శ్రీ (1001) భ్రమరానంద స్వామివారికి ఒక అసాధారాణమైన కోరిక కలిగింది. ఈ కోరిక వెనుక, మతసంబంధపరంగా, ఒక బలవత్తరమైన కారణం లేకపోలేదు. ఆ కారణం మీకు, నాకు, మనకథకీ అనవసరం. ఊరూరా తిరిగి, దేశదేశాలూ సందర్శించి, సనాతన ధర్మ పరిరక్షణ చేస్తున్న తమ శిష్యపుంగవులందరినీ చూసి, వారలనెల్ల దీవించి, గురుదక్షిణ పుచ్చుకొని రావాలనే కోరిక బలమైంది శ్రీ వారికి. బృందావనంలోని బృహన్మఠంలోవున్న శిష్యపరివారానికి తమ అభిలాష వెల్లడించారు, శ్రీ స్వామివారు. ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు. వెనువెంటనే శిష్యపరివారం శ్రీ శ్రీ శ్రీ (1001) భ్రమరానంద స్వామివారి పల్లకీ, అదే!, బంగారు పల్లకీని సిద్ధం చేశారు. సపరివార సమేతంగా శ్రీ స్వామివారు పెద్దప్రయాణానికి సిద్ధమయ్యారు. అన్ని ఊళ్ళూ బంగారు పల్లకీలో తిరిగి అందరిశిష్యుల్నీ పరామర్శించి, అందరి దగ్గరా దక్షిణ తీసుకొని, తిరిగి బృందావనం రావడానికి, సరిగ్గా ఒక పుష్కరం (అంటే పన్నెండు సంవత్సరాలు) పడుతుందని అంచనా. అది సనాతనకాలం. ఇప్పుడయితే శ్రీ స్వామి వారు బృందావనంలో బోయింగు 747 ఎక్కి, సరాసరి న్యూయార్కే వచ్చెయ్యగలరు. వసంత గ్రీష్మ ఋతువులు ఈ మ్లేచ్ఛదేశంలో గడిపి, యిక్కడి శిష్యకోటిని దీవించి డాలర్ల దక్షిణ పుచ్చుకోని, శీతాకాలం రాకముందే తిరిగి బృందావనం చేరుకో గలిగి వుండేవారు, శ్రీ స్వామివారు.

కొంత పరివారం ముందు, మరికొంత పరివారం వెనక, కాలినడక రాగా, శ్రీ స్వామివారు బంగారు పల్లకీ నధిష్టించారు. పరివారం తరలింది. ఊరిపొలిమేరకు రాగానే, అనుకోకుండా పరివారం, భోం భోం అంటూ బంగారు పల్లకీ మోస్తున్న బోయీలు తక్కున ఆగిపోయారు. ఏమీ ఘాతుకం అని శ్రీ స్వామివారు విస్తుపోయారు. ఇంకా విస్తు బోతూనే ఉన్నారు. ఇంతలో ముందు నడుస్తున్న ముఖ్యశిష్యుడొకడు వచ్చి, ''స్వామీ! తమబాటకి అడ్డంగా ఛండాలుడొకడు పరమమూర్ఖంగా కూర్చున్నాడు. కదలడు. ఎంత గదిరినా బాట సడలివ్వటంలేదు,'' అని వాపోయారు. శ్రీ స్వామివారు వెంటనే ఆ బంగారు పల్లకీని అ మూర్ఖునికి దగ్గరగా తీసుకుపొమ్మని ఆజ్ఞాపించారు. బోయీలు మళ్ళీ భోంభోం అంటూ, బంగారు పల్లకీనెత్తి, మూర్ఖుని సమీపానికి శ్రీ స్వామివారిని తీసుకొచ్చారు. శ్రీ స్వామివారు ఆ ఛండాలుని ఉద్దేశించి, ''ఓరి మూర్ఖుడా! మా బాటకి అడ్డం తప్పుకో,'' అని హెచ్చరించారు. వాడు ఛండాలుడు, అందుకు తోడు మూర్ఖుడని ముందే చెప్పుకున్నాం కదా! వాడు కదలలేదు సరిగదా, శ్రీ స్వామివారిని ఉద్దేశించి, ''సామీ! తవరు ఎంతోమందికి సొరగ్గానికెళ్ళే (స్వర్గమూ అని తెలుగు!) దోవ సూపిస్తున్నారు. ఆ సొరగ్గానికి పోయే దోవ నాక్కూడా సూపించండి. లేపోతే నేను మీకు దోవ యియ్యనే యియ్యను,'' అన్నాడు. శ్రీ స్వామి వారికి ఎప్పుడూ కోపంరాదు. విసుగు కూడా చిరునవ్వు వెనుక దాయగలరు. శ్రీ స్వామివారు, ''హే పుల్కసా! (అంటే ఓరీ ఛండాలుడా అని తెలుగు!) స్వర్గానికి మార్గం అందరికీ చెప్పనలవికాదు. అది అతి కష్టమయిన మార్గం. నీ మూర్ఖత్వం వదిలి మా పరివారానికి బాట నియ్యి,'' అని ఆదేశించారు. మన మూర్ఖుడు ససేమిరా వినలేదు. మూర్ఖుడు కద! ఎవరు చెప్పితే మటుకు వింటాడు!

శ్రీ స్వామివారు ఛండాలుని మూర్ఖత్వానికి దిగులుపడి, వీడి బాధ వదిలించుకోవడం కోసం, '' సరే! నీవు స్వర్గం చేరేందుకు పద్ధతి చెపుతా,'' నన్నారు. ఛండాలుని ముఖం నల్ల కలువలా వికసించింది. శ్రీ స్వామి వారి ఉవాచ. '' ఓరీ! ఛండాలుడా! నీవు నీ రెండు చేతులూ జోడించి, ఆకసమువేపు నీ ముఖము ఎత్తి, కళ్ళు మూసుకొని

ఒంటి కాలిపై యీబాట పక్కనే నిలబడుము. అట్లాచరించిన, నీవు స్వర్గమునకు తప్పక చేరుకోగలవు.'' మూర్ఖుడయిన ఆ ఛండాలుడు శ్రీ స్వామి వారు ఆదేశించిన విధంగా నిలబడి, శ్రీ స్వామివారి పరివారానికీ, బంగారు పల్లకీకి బాట వదలిపెట్టాడు. శిష్యపరివారం శ్రీ స్వామివారి సమయస్ఫూర్తికి జేజేలు పలుకుతూండగా, శ్రీ స్వామివారి బంగారు పల్లకీని బోయీలు భోంభోం అనుకుంటూ మోసుకుపోయారు. ప్రయాణం నిర్విఘ్నంగా సాగిపోయింది.

పన్నెండు సంవత్సరాలు, అంటే ఒక పుష్కరం, శ్రీ స్వామివారు, ఊరూరూ తిరిగి, రేడులనీ శ్రేష్ఠులనీ పరామర్శించి, [illegible] కనక వజ్ర వైఢూర్యాలు గురుదక్షిణలుగా స్వీకరించి, తిరుగు ప్రయాణం సాగించారు. తమ ఊరి పొలిమేరకు వచ్చారు, బంగారు పల్లకీలోనే! మామూలు మనుషులయితే, ఊరిపొలిమేరలో బాట ప్రక్కకి చూసేవారే కాదు. శ్రీ స్వామివారిది సునిశిత దృష్టి. బాట ప్రక్కనే శ్రీ స్వామివారికి జోడించిన రెండుచేతులు మాత్రం కనిపించాయి. శ్రీ స్వామి వారు ఆశ్చర్య చకితులయినారు. బంగారు పల్లకీని ఆపమని ఆజ్ఞాపించారు. ఆ జోడించిన రెండుచేతులు చుట్టూ పుట్టలు గుట్టలుగా పెరిగిపోయాయి. 'ఏమీ వింత', అనుకుంటూ, శ్రీ స్వామివారు బంగారు పల్లకీ దిగి, జోడించిన రెండుచేతులు మాత్రమే కనిపిస్తున్న పుట్టల దగ్గిరకి నడవడం ప్రారంభించారు. పరివారమంతా విభ్రమచకితులై నోరు తెరుచుకొని చూస్తున్నారు. అలా, శ్రీ స్వామివారు మెల్ల మెల్లగా ముళ్ళబాటలో, పుట్టల దగ్గిరకు చేరుతున్న సమయంలో మరోవింత మొదలయింది.

ఆకాశంవేపు ముఖం ఎత్తి, రెండుచేతులూ జోడించుకొని, ఒంటి కాలిమీద నిలబడ్డ మూర్ఖుడయిన ఛండాలుడు మెల్లగా ఆకాశం వైపు తేలిపోవడం చూశారు, శ్రీ శ్రీ శ్రీ (1001) భ్రమరానంద స్వామివారు. శ్రీ స్వామివారు వెనువెంటనే, ''ఆహా! నేనుకూడా బ్రహ్మసాన్నిధ్యం చేరుటకు, యిది ఒక్కటే మార్గం,'' అని అనుకుంటూ, పరుగు పరుగున పోయి, ఆ ఛండాలుని కాలు పట్టుకొని వేళ్ళాడారు. మూర్ఖుడయిన ఛండాలుడు, వాడికాలు పట్టుకొని వేళ్ళాడుతూ శ్రీ శ్రీ శ్రీ (1000) భ్రమరానంద స్వామివారూ, స్వర్గారోహణం చేశారు. పరివారం, శిష్యబృందం నోరు తెరుచుకునే చూస్తున్నారు, యింకా!

* * * * *


**A Great Christmas Gift**
for your Telugu friends and family

**MAHABHARATAM**
in
**Telugu audio** cassettes (7 1/2 hours)
including 45min. of
**BHAGAVAD GITA**

Narrated by **Ashalatha** and sung by
**Vanijayaram, Ramakrishna, Anand and Muralidhar**

*** * * 1000s sold * * ***

20 day **SATISFACTION GUARANTEE** or
your money back.

only **$19.95** plus $2 s&h
**$5.00 off** (the total) for two or more

Send check payable to Srikanth, SKNV Productions,
5699 Kanan Road #132, Agoura Hills, CA 91367.
(818)346-7743


## విశ్రాంతి

పి.వి.జి.

వ్యాకులమున నేలబడ
కలవరపడి కలతజెందె
అనేక జాతి పత్రములు
ఆకులు రాలుకాలమిది

ఆకాశపు కౌగిళ్లలో
మేఘాల మంచుపొరల్లో
కాంతికిరణ కదలికల్లో
చైతన్య రసాస్వాదనకై
కలలు గన్న ఆకుల బ్రతుకులు
నేలజారిన వలపులయ్యె.
కిరణజన్యసంయోగక్రియలలో
నిత్యహరిత సంగ్రహణ ప్రియులై
స్వర్గానికి మార్గమదేనని
నిరీక్షించిన వృక్ష సంతతి
భూతల పతనము చెందె.

ఆకాశం చీల్చుకుని
అనురాగం పెంచుకుని
రవికిరణ తేజములు
శశికళల చలువలు
తమశోభల ప్రకీర్ణతకై
తమజీవిత మలంకరించి
తరుశాఖల విడచి రాలిన
చిరు హృదయాల స్పృశించి
మమకారం చిలకరించి
మంచి మాటలు పలికాయి.
''మీ అణువుల పరిణామం
మా అందరి నిత్య ధర్మం
అణువణువున అంతరాత్మ
మనందరికి పరమాత్మ
కృతజ్ఞతా పూర్వక సంయోగ ప్రక్రియ
మేమిచ్చెడు పరిహారం''

చిత్రవర్ణ శోభల వెలుగుచు
భూదేవి కౌగిళ్లలో
నిద్రించె వృక్షసంతతి.
ప్రకృతిని పలకరించి ఆకాశం
మరీ మరీ చెప్పింది
నా విశాల విస్తృతంలోనే
నా అణువుల విశ్రాంతి.